# చలిచీమ

రంగసామితో నమశ్శివాయ కుస్తీకి పోటీ చేస్తాడని విని నా చెవుల్ని నేను నమ్మలేకపోయాను. మదించిన ఏనుగులాగ ఉండే రంగసామి ఎక్కడ, పిపీలికలాగ పాకే నమశ్శివాయ ఎక్కడ? రంగసామితో చెయ్యి కలపాలన్న ఆలోచనకే పై ప్రాణాలు పైనే పోవలసిన నమశ్శివాయ – పోటీ చేసి నిలబడడం – నమ్మదగిందిగా లేదు.

కాని నమ్మక తప్పలేదు. ఊరునిండా, హోటళ్ళలోనూ, బజార్ల దగ్గరా – మూడో నాటికి బోర్డులు పెట్టేశారు. అందరూ ఈ విషయాన్ని వింతగా చెప్పుకున్నారు. కొందరు బోర్డుముందు నిలబడి పగలబడి నవ్వారు.

"వాళ్ళిద్దరి ఫోటోలూ వేసి ప్రకటనలు చేస్తే మరింత పలుకుబడి" అని ఎవరో నవ్వుతూ అంటే మరో రెండు రోజులకి నిజంగానే యిద్దరి ఫోటోలతో ప్రకటనలు వెలిశాయి! ఫ్రేము పగిలిపోతుందా అన్నట్టు రంగసామి ఫోటో ఉంటే – పొడవాటి పూలదండ వేసుకొని, లాల్చీ, పంచెతో నిలబడి నమస్కారం చేస్తున్న నమశ్శివాయ ఫోటోని వేశారు.

ఈ మధ్య ఒకటి రెండు సంవత్సరాలుగా నమశ్శివాయ ఎక్కడా కనిపించలేదు. ఇలాంటి వార్త విన్నాక – బాగా వొళ్ళు చేశాడేమో – ఎక్కడయినా సాధనా గట్రా చేసి వచ్చాడేమో అనుకొన్నాను. కాని, ఫోటో చూశాక ఆ అనుమానమూ తీరి పోయింది. మునుపట్లాగే – రివటలాగ – వంపు తిరిగిన పేముబెత్తంలాగ ఉన్నాడు.

రంగసామి మా వూళ్లోనేకాదు – ఈ చుట్టుపక్కల ఊళ్ళల్లో, రాష్ట్రంలో, దేశంలో పేరుపడ్డ వస్తాదు. ఒకటి రెండుసార్లు 'ఒలింపిక్స్'కి కూడా వెళ్ళి వచ్చాడు. అందరి వస్తాదుల్లాగా తుప్పబలిసిన శరీరం కాదు అతనిది. ఎక్కడ ఉండవలసిన కండ అక్కడ ఉండి, పిటపిటలాడుతూ చూడముచ్చటగా ఉంటాడు. మంచి గిరజాల జుత్తు, ఎప్పుడూ ముఖం మీద ఆరిపోని చిరునవ్వూ – అతని మనస్సూ, శరీరమూ ఆరోగ్యకరమయిందని చూడగానే అర్థమయిపోతుంది. ఊళ్లో ఒక వ్యాయామశాల నడుపుతున్నాడు. అతని వెనక కనీసం యిద్దరు ముగ్గురయినా శిష్యులు ఎప్పుడూ ఉంటారు. ఊళ్ళో ఎక్కడ ఏ సభ జరిగినా తప్పకుండా హాజరవుతాడు. వచ్చి ఒక మూలన కూర్చొంటాడు. అయిపోగానే లేచి వెళ్ళిపోతాడు. ఎవరేనా తెలిసినవాళ్ళు పలకరిస్తే – అంత మనిషీ వంగి నమస్కారం చేస్తాడు.

ఊళ్ళో కుస్తీపోటీల్ని ప్రోత్సహించింది అతనే. పైఊళ్ళనుంచి వస్తాదుల్ని రప్పించి ఏర్పాటు చేయించేవాడు. క్రమంగా పోటీలు హుషారు పుంజుకున్నాయి. టిక్కెట్లతో వచ్చే డబ్బుని గెలిచినవాడికి – ఖర్చులు పోను – యిస్తూండడం ఆనవాయితీ అయిపోయింది. ఎవరూ లేనప్పుడు రంగసామి శిష్యులే తలపడతారు.

ఓసారి పంజాబునుంచి వచ్చిన పేరు పొందిన వస్తాదుని – మెడతిప్పనివ్వకుండా మెలిక వేశాడు రంగసామి. వచ్చినవాడు ఎనుబోతులాంటి మనిషి. నున్నగా నల్లశానం రాయిలాగ ఉన్నాడు. అంత మనిషీ రంగసామి పట్టుకి కిరకిరలాడిపోయాడు. మూడు విడతలు కానిచ్చి నాలుగో విడతకి ఆ వస్తాదుని తొక్కేశాడు రంగసామి. అది చాలా గొప్ప పోటీ. చూసినవాళ్ళకి – అది తలుచుకొన్నప్పుడల్లా నిద్రపట్టదు. మరి ఆ రోజు ప్రేక్షకుల్లో నమశ్శివాయ కూడా ఉన్నట్టు గుర్తు. ఆ పోటీ చూసికూడా ఎలా తలపడ్డాడా అని ఆశ్చర్యపడ్డాను.

ఎవరేనా మాట పట్టింపుకో, పెంకితనానికో అతణ్ని ముందుకు తోశారేమో అనుకున్నాను. ఎంత తోసినా ప్రాణం మీద ఆశ ఉన్నవాడెవడూ అందుకు వొప్పుకోడు. అసలు ఆ ఆలోచనలోనే అపహాస్యం వ్యక్తమవుతుంటే? కాని తర్వాత తెలిసింది. ఎవరూ అతణ్ని ఈ పోటీకి పురికొల్పలేదట. ఓరోజు ఉన్నట్టుండి నమశ్శివాయ రంగసామి ఎదుటపడి పోటీకి నిలుస్తానన్నాడట. రంగసామి మొదట తెల్లబోయినా, తమాయించుకొని నవ్వేసేడట. తనంటే కిట్టనివాళ్లు యితన్నలా పురికొల్పి తనని అవమానించాలనుకొన్నారేమో ననుకున్నాడట. కాని నమశ్శివాయ వదల్లేదు. పదిరోజులు వరుసగా కనిపించి బ్రతిమాలాడాడు, ఎదిరించాడు, రెచ్చగొట్టాడు. పోటీల నిర్వాహకుల్ని పట్టుకొని మూడు నాలుగు రికమెండేషన్లు తెచ్చాడు. రంగసామికీ – యీ సాహసానికి కారణమేమిటో అర్థం కాలేదు. ఏమయితే నేం? యిన్ని రకాలుగా వత్తిడి తెచ్చేసరికి సరే అనక తప్పలేదు.

ఇది విని నమశ్శివాయ హితులు, స్నేహితులు, కొందరు అతనికి బుద్ధి చెప్పబోయారట. "చావాలనుంటే ఏ రైలుకిందో పడు, నదిలో దూకు, ఎలక్ట్రిక్ స్విచ్‌లో

చెయ్యిపెట్టు. అంతేకాని అనవసరంగా రంగసామి చేతిలో పడ్డావా అడ్డంగా విరిచేస్తాడు" అని హెచ్చరించారు. కాని నమశ్శివాయ త్రికాలజ్ఞుడిలాగ నవ్వాడు. "కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాల"న్నాడు. "ఈ దెబ్బతో నమశ్శివాయ ఉండాలో ఊడాలో తేలిపోతుంద"న్నాడు. అతనికైతే తేలలేదేమో కాని, యిది విన్నవాళ్ళంతా తేల్చేసుకున్నారు – "ఈసారితో నమశ్శివాయ ఆయువు మూడిందని."

ఏది ఏమయినా ఈ వార్త ఈదురుగాలి లాగ ఊరూవాడా పాకిపోయింది. ఇదేదో విచిత్రంలాగ అందరూ చెప్పుకున్నారు. "సన్నంగా ఉండే మనిషి – వెదురుబద్దలాగ ఉండేవాడు – రంగసామితో కుస్తీపడతాడట" అంటూ మాట్లాడుకొన్నారు. ఈ వార్త పక్కవూళ్ళకీ పాకిపోయింది. టిక్కెట్లు అమ్ముడుపోయాయి. కుస్తీని వినోదంగా కంటె వింతగా చూడాలనుకొన్న వాళ్ళే ఎక్కువ టిక్కెట్లు కొన్నారు. ఆ వూరు చేరగలిగినంత దూరంలో ఉన్న ప్రాంతాలన్నిటికీ టిక్కెట్లు పాకిపోయాయి. జిల్లా కలెక్టరుగారు నాలుగు టిక్కెట్లు తెప్పించుకున్నారు. మొదట ఈ కార్యక్రమం మామూలుగా పోటీలు జరిపే ఆవరణలో జరపాలను కొన్నా, టిక్కెట్లు కోత పెరగడంతో గాంధీ మైదానానికి మార్చారు. ముమ్మరంగా ఏర్పాట్లు సాగిపోయాయి. ఒకటికి మూడుసార్లు టిక్కెట్ల పుస్తకాలు ప్రింటయ్యాయి.

అతి తక్కువ కాలంలో విచిత్రమయిన పాపులారిటీ వచ్చేసింది నమశ్శివాయకి. ఒకటి రెండు పత్రికలవాళ్ళు అతణ్ణి గురించి ఒకటి రెండు పేజీల వ్యాసాలు వ్రాశారు. అందరూ అన్ని విషయాలూ వ్రాశారు కాని, రంగసామితో అతను పోటీ చెయ్యడానికి అతనికున్న ధైర్యం ఏమిటో చెప్పలేకపోయారు. దానికి కారణం నమశ్శివాయ ఎవరితోనూ చెప్పకపోవడమే . అందరికీ అతను ఒకటే సమాధానం చెప్పున్నాడట – "ఆరోజు మీరే చూస్తారుగా?" అంటూ.

నమశ్శివాయని ఆహ్వానించి మంచి డిన్నర్ యిచ్చారు పోలీసు సూపరింటెండెంట్. ఒకటి రెండుచోట్ల సభలు కూడా జరిగాయని విన్నాను. ఎప్పుడూ పోటీచేసే రంగసామి మీద ఎవరికీ దృష్టి పోలేదు. రంగసామి కారణంగా నమశ్శివాయ పరపతి పెరిగిపోయింది. ఒకరిద్దరు రంగస్వామి దగ్గిరికి వెళ్ళి "ముండాకొడుకు ఏం మంత్రాలు నేర్చుకున్నాడో. వాడితో నీకు పోటీ ఏమిటి మానెయ్" అని రంగసామికే సలహా యిచ్చారట. కాని రంగసామిది ఉడుంపట్టు. ఇలాంటి విషయాల్లో అతని మాటకీ చేతకీ తిరుగులేదు. అదీగాక తీరా ఒప్పుకున్నాక, యింత హడావుడి జరిగాక తను బెసిగితే ఓడిపోయినట్టే. చస్తే వెనుకంజ వెయ్యనన్నాడు.

నమశ్శివాయ చాలా హడావిడిగా ఎక్కడెక్కడికో తిరుగుతున్నాడని విన్నాను. ఈ వార్త బయటపడ్డాక నాకు ఒక్కసారీ కనిపించలేదు. కనిపిస్తే చాలా అడగాలనుకొన్నాను. అయితే నేనడగబోయే ప్రశ్నలు అందరూ అడిగేసినవీ, అడుగుతున్నవీను. నాకూ ఆ సమాధానమే చెప్తాడనీ తెలుసు. అయినా ఒకసారి కలిస్తే బావుణ్ణనుకున్నాను.

కాని వీలులేకపోయింది. పోటీ యిక పదిపదిహేను రోజులుందనగా నమశ్శివాయ

మరీ కావలసిన మిత్రులు అతన్ని "చివరిసారిగా" ఒక్కొక్కరే భోజనానికి పిలుచుకు వెళ్ళడం ప్రారంభించారట. రోజులు గడుస్తున్నకొద్దీ వాళ్ళకి అతనిమీద జాలి ఎక్కువయింది. కాని నమశ్శివాయ చలించలేదు. ఎప్పటిలాగే చిరునవ్వూ, పట్టుదలా వదిలిపెట్టలేదు.

నమశ్శివాయ జీవితంలో చాలా రంగులు మార్చాడు. చాలా వేషాలు వేశాడు. చాలా అవతారాలెత్తాడు. అంటే దుర్మార్గుడూ, కానిపని చేసినవాడూ అని కాదు. కాని చెయ్యడానికి వెనుదీయడని నా అనుమానం. బ్రతకనేర్చిన మనిషి. ఏ మనిషిని లోబరుచుకోడానికి ఏవిధంగా ప్రవర్తించాలో అతనికి కరతలామలకం. చెప్పులదుకాణం దగ్గర్నుంచి, సిమ్మెంటు బస్తాల కాంట్రాక్టు వరకూ వ్యాపారాలన్నీ చేశాడు. సినీమా హాలు దగ్గర టిక్కెట్లు చింపడం దగ్గర్నుంచి, వూళ్ళోకల్లా గొప్ప హోటల్ మేనేజరు పదవి వరకూ అన్నీ చూశాడు. ఉన్నట్టుండి ఊళ్లోంచి మాయమయి ఏ ఆరునెలలకో ప్రత్యక్షమవుతాడు మళ్ళీ. "ఏం నమశ్శివాయా! ఈ మధ్య కనిపించలేదు?" అంటే వ్యాపారంమీద ఢిల్లీ వెళ్ళాననో, పూనా వెళ్ళాననో అంటాడు. పరీక్షల్లో స్టూడెంట్స్‌కి మార్కులు వేయించడం, బస్సు పర్మిట్లు, నీటి బావులకి రికమెండేషన్లు లాంటివి అతి సునాయాసంగా జరిపించుకువస్తాడు. పోలీసుశాఖకి తలలో నాలిక. దొంగసారాకేసులు, దొంగరవాణాలు, బ్రోతల్ కేసులూ గుమ్మం కదలకుండా వాళ్ల జాతకాలు చెప్పేస్తాడు. ఎవరో కిట్టనివాళ్ళు ఒకటి రెండుసార్లు అతనిమీద దెబ్బతీశారు. ఓసారయితే తల పగిలింది. రెండు నెలలు ఆసుపత్రిలో ఉండి వచ్చాడు. అయినా బ్రతుకుధోరణిని మార్చలేదు. మార్చడం ఆ వయస్సులో అసాధ్యం కనక. రాజకీయ నాయకుల సన్మానాల్లో మొదటి దండ అతనిది పడాల్సిందే. ఏ సంస్థ వార్షికోత్సవం జరిగినా అతను ముందుండి నడుం బిగించాల్సిందే.

అతను చేసిన నిర్ణయానికీ, చేపట్టిన వ్యాపారానికీ తిరుగుండదని ప్రతీతి. తనే కావాలని మానుకొంటే తప్ప ఏ వ్యాపారమూ దివాలా తియ్యలేదని చెప్పుకుంటారు. అలాంటిది రంగసామితో పోటీ చేశాడంటే ముందు వెనకలాలోచించకుండా ఉండడన్న నమ్మకం కూడా ప్రజల్లో కొంత ఆసక్తిని కలిగించి ఉంటుందని నా నమ్మకం.

ఇన్ని వ్యాపారాలు చేసి, యిన్ని వ్యవహారాలు నడిపినా – డబ్బు కూడదీసుకున్నట్టు తోచదు. అతనికి నా అన్నవారెవరూ లేరు. పెళ్ళి లేదు. "పెళ్ళిలేని నాకు యిల్లెందుకని కొనడం మానేశాను" అంటాడు – యింటి ప్రస్తావన ఎవరయినా తెస్తే. అది అతని ఫేవరెట్ జోక్! కాని ఎక్కడో సాతానుల అమ్మాయిని చేరదీశాడని చెప్పుకుంటారు. అయితే అతని జీవితంలో ఆ భాగం ఎవరికీ ఎక్కువ తెలీదు.

మరి అంత వ్యాపారశీలత, లోక ధర్మం తెలిసినవాడు యిలా రంగసామితో ఎలా పోటీకి సిద్ధపడ్డాడో ఆశ్చర్యమే. సందేహం లేదు. ఇందులో ఎక్కడో మనకు అర్థం కాని కీలకం ఉన్నదనిపించింది. సమయం మించి పోకుండానే వెళ్ళి నేనూ ఓ టిక్కెట్టు కొని తెచ్చుకున్నాను.

ఇంకో వారం రోజులకి పోటీ ఉందనగా, టిక్కెట్లన్నీ అయిపోయాయి. కావలసిన

వాళ్ళూ, కొనాలని ఉత్సాహం పడుతున్న వాళ్ళూ చాలామంది ఉన్నా స్థలాభావంచేత మరి అమ్మలేక పోయారు నిర్వాహకులు. వసూళ్ళ ప్రకారం దాదాపు పదివేల రూపాయలు గెలిచిన వ్యక్తి కి దక్కుతుందని తేలిపోయింది. ఆ డబ్బు ఎవరికి దక్కుతుందో కూడా తేల్చేసుకున్నారా పూట—ఇంకా పోటీ జరక్కముందే. ఏమైనా ఈ రూపంగా నయినా రంగసామి బాగుపడుతున్నాడని కొందరు సంతోషించారు.

మరునాడు అనుకోకుండా కలిశాడు నమశ్శివాయ. "ఓ ఉత్తరం ముక్క వ్రాసి పెట్టండి" అంటూ అరుగుమీద కూర్చొన్నాడు. చూశాను. నమశ్శివాయ యిదివరకటికంటె ఏమీ మారలేదు. కాకపోతే – కాస్త పుష్టిగా, నిండుగా కనిపించాడు. మనిషి ప్రశాంతంగా, నిర్భీతితో ఉండడం నన్నాశ్చర్య పరిచింది.

"పోటీ రోజు దగ్గర పుడతూంటే నీకు భయం కలగటం లేదా?" అన్నాను.

నవ్వాడు.

"ఎలా పోటీ చేస్తావు రంగసామితో. ఏమిటి నీ ధైర్యం?" అనడిగాను అప్పటికే వందలాది మంది అతణ్ణి అడిగుంటారని తెలిసినా. అందరికీ చెప్పే సమాధానమే నాకూ చెప్పాడు. చిరునవ్వు నవ్వి "ఆ రోజు ఎలాగూ దగ్గర పడుతోంది. చూస్తారుగా?" అన్నాడు. తర్వాత ఆమాటా యీమాటా మాట్లాడుకున్నాం. నమశ్శివాయ ఉత్సాహంగానే మాట్లాడాడు. ఈ ప్రయత్నం అతని స్థిమితాన్నేమీ చెదరగొట్టినట్టు కనిపించలేదు. తర్వాత నా చేత ఏదో ఉత్తరం వ్రాయించుకొని వెళ్ళిపోయాడు. అతనికి ఉత్తరాలు వ్రాసిపెట్టడం నా కలవాటే – ఎవరో స్నేహితుడి కొడిక్కి వంట్లో బాగులేదట. వీలయితే త్వరగా బయలుదేరి రమ్మని స్నేహితుడికి ఉత్తరం. ఈ హడావుడిలోనూ స్నేహధర్మాన్ని మరిచిపోలేదు నమశ్శివాయ. ఉత్తరం వ్రాసి యిచ్చాను – వెళ్ళిపోయాడు.

ం ం ం ం ం

పోటీ రోజున ఊరంతా హడావుడిగా ఉంది. కార్లు, బళ్లు, బస్సులూ, రిక్షాల రాకపోకలే పెద్ద సమస్య అయిపోయింది. గాంధీ మైదానం నిండా ప్రేక్షకులు క్రిక్కిరిసి పోయారు. సింహద్వారం దగ్గర రంగసామిది, నమశ్శివాయదీ రెండు పెద్ద ఫొటోలు ఉంచారు. నేనూ ఓ మూల చేరి కూచున్నాను.

కుస్తీ చేసే చోటున వెలుగు పడేలాగ – పెద్దపెద్ద లైట్లను ఏర్పాటు చేశారు. చుట్టూ బలమైన తాళ్ళు. అక్కడికి మూడు గజాల దూరంనుంచీ ప్రేక్షకులు.

సరిగ్గా వేళకి రంగసామి వచ్చేశాడు – అనుచరులతోపాటు. తాహతుగలవాడి అంగ ప్రదర్శనలోనూ అందం ఉందనుకొంటాను. అతను వస్తూంటే ఆకలిగొన్న పులి నడుస్తున్నట్టు అనిపించింది. అతన్ని అలా చూడడం ప్రేక్షకులకు అలవాటే. అయినా యీసారి అతని ఠీవినీ, రాజసాన్నీ చూడడంతోటే – ప్రేక్షకులంతా చప్పట్లు చరిచారు. ఆ ధ్వనిలో, ఆ కోలాహలంలో "ఈ పోటీ ఫలితం మాకు తెలుసులే" అన్న నిశ్చయమూ ధ్వనించింది.

నమశ్శివాయ రావడం కూడా – ప్రేక్షకుల్లో అంత ఉత్సాహాన్ని కలిగించిందనే చెప్పాలి. కొందరు ప్రేక్షకులు మరీ ఉద్రూత లూగిపోయారు. రంగసామి శక్తికీ, నమశ్శివాయ సాహసానికీ వాళ్లు హర్షాన్ని ప్రకటించారు.

నేను వాళ్ళకు కాస్త దగ్గరలోనే వున్నాను. చూస్తుంటే ప్రేక్షకులకు అర్థం కాని విషయాలు ఒకటి రెండు నాకర్థమయాయి. రంగసామి ముఖం ఎందుకో వాడినట్టూ, నలిగినట్టూ కనిపించింది. మనిషి పరాకుగా వున్నాడు. కేవలం శక్తివల్ల వచ్చిన నిర్లక్ష్యమే కాదది. మరేదో కారణం ఉండి ఉంటుందనిపించింది. నమశ్శివాయ మాత్రం చాలా మెలకువగా పులి నోటికి దొరికిపోనున్న జింక – దాని ప్రతి కదలికనూ గమనిస్తూ – తప్పుకోవడానికి తోవ వెదుకుతున్నట్లు కనిపించాడు. ప్రతి వస్తాదుకీ కొన్ని బలహీనపు పట్లుంటాయి– ఆ 'వీక్ పాయింట్స్' గ్రహించినట్టున్నాడు నమశ్శివాయ. తన వెనక నిలబడ్డ అనుచరుల్ని పదపదే సంప్రదిస్తున్నాడు.

పోటీ ప్రారంభమయే వేళయింది. మధ్యవర్తులిద్దరూ తాటికి అటూ ఇటూ చేరారు. అది నిరుత్సాహమో, ఉత్సాహం అనావశ్యకతో కాని – రంగసామి అతి సామన్యంగా తాటిలోకి దిగాడు. నమశ్శివాయ తాటిమీంచి లోపలికి ఒక్క దూకు దూకి – ప్రేక్షకుల్ని ఆకర్షించాడు. ఆ ఉత్సాహాన్ని అందరూ మెచ్చుకున్నారు.

కుస్తీ చాలా ఉత్సాహవంతంగా ప్రారంభమయింది. పరాకుగా వున్న రంగసామి చూట్టూ– గుంట నక్కలాగా సుడులు తిరిగాడు నమశ్శివాయ. చూసే వాళ్ళకి నమశ్శివాయ కదలిక చాలా చురుకుగానూ, విచిత్రంగానూ కనిపించింది. ప్రజా సందోహానికి పట్టే కదలికలన్నీ – రంగస్వామికి దొరకకుండా గుప్పించాడు నమశ్శివాయ. ఒకటి రెండుసార్లు యిద్దరూ కలబడినా – శలాకలాగా రంగసామి బలమైన చేతుల మధ్య నుంచి ఒడుపుగా జారిపోయాడు. ఉండుండి ఒకటి రెండు దెబ్బలు తీశాడు. మొదటి రెండు రౌండ్లూ ఏ సంఘటనా లేకుండానే గడిచిపోయింది. అట్లా గడవడమే తన విజయమన్నట్టు రొమ్ము విరుచుకున్నాడు నమశ్శివాయ. ప్రేక్షకులూ అంగీకరించారు. విచిత్రంగా – ఏమీ జరక్క-పోవడం ద్వారా మొదటి విజయాన్ని సాధించాడు నమశ్శివాయ. ప్రేక్షకుల్లో ఉత్సాహం పెరిగిపోయింది. రెండో 'రౌండు' చాలా అసక్తికరంగా ప్రారంభమయింది. రంగసామిలో కొంచెం ఉత్సాహం, చిరుకోపం కనిపించింది నాకు. నమశ్శివాయ పట్ల హర్షాన్ని ప్రేక్షకులు ప్రకటించడం కాస్త చురుక్కు మనిపించినట్టు గమనించాను. ఈ చిరు కోపానికి తోడయేటట్టు నమశ్శివాయ ఒక బలమైన దెబ్బ తీశాడు. ఆ పట్టుకి అంత మనిషీ కిరకిర లాడాడు రంగసామి. కాని ఆ తర్వాత 'పులి' అయిపోయాడు రంగసామి. అప్పుడిక చావుకి సిద్ధపడ్డ లేడిపిల్ల కళ్ళల్లో భయాన్ని చూశాను నేను నమశ్శివాయ కళ్ళలో. తాళ్ళను ఆనుకొని – రంగసామిని తప్పించుకొంటూ తిరిగాడు. కాని ఎంతసేపు? ఇంకో అర నిముషానికి రౌండు అయిపోతుందనగా రంగసామి చేతులకి దొరికిపోయాడు. ఒక్కసారి అమాంతం నమశ్శివాయను ఎత్తి పట్టుకుని

గిర్రున లాటీ కర్రను తిప్పినట్టు తిప్పాడు రంగసామి. ప్రేక్షకులు స్థంభీభూతులయి పోయారు. అతని విసురునుంచి నమశ్శివాయను కాపాడడానికి మధ్యవర్తులూ, అనుచరులూ ప్రయత్నించారు. కాని రంగసామి విసిరేశాడు. అయితే విసురులో అంత ఉధృతం తెలియలేదు. అనుచరులు సమయానికి నమశ్శివాయని అందుకోగలిగారు.

ప్రేక్షకులలో కలకలం బయలుదేరింది. కొందరు నమశ్శివాయ దగ్గరికి పరిగెత్తారు. చాలామంది రంగసామి ప్రతాపానికి హర్షాన్ని కంటె – నమశ్శివాయ పట్ల సానుభూతినే ప్రకటించారు. కొందరు పెద్దలు – యిక యీ 'కుస్తీ' యిక్కడితో ఆపెయ్యవచ్చునన్నారు. నమశ్శివాయకు ముఖం తిరిగి ఉంటుందని నా అనుమానం. కాని వెంటనే తేరుకున్నాడు. అయితే కుస్తీ ఆపుచెయ్యడానికి మాత్రం అంగీకరించలేదు. ఏ ధైర్యం, ఏ బలం అతణ్ని పురికొల్పుతున్నదో కాని 'కుస్తీ జరగాల్సిందే' అని పట్టుబట్టాడు.

మూడో రౌండుకి సన్నాహాలు జరిగాయి. ప్రేక్షకులంతా స్థంభీభూతలయి చోద్యం చూస్తున్నారు. ఏ క్షణాన్నయినా ఏదయినా జరగవచ్చు. మూడో రౌండు ప్రారంభించే సమయానికి ఎవరో టెలిగ్రాం బంట్రోతు కుస్తీ జరిగే స్థలానికి రావడం కనిపించింది. ఒకరిద్దరు అతనితో మాట్లాడుతున్నారు. బంట్రోతు ఏదో చెప్తున్నాడు. అతన్ని ఆపుతున్నారు. కాని రంగసామి యిది గమనించాడు. వెనక్కి తిరిగి ఏమిటన్నాడు. బంట్రోతు సరాసరి ముందుకొచ్చి టెలిగ్రాం అతనికి అందించాడు. రౌండులోకి వెళ్లే ముందు ఆగి – టెలిగ్రాం చదువుకున్నాడు రంగసామి.

అప్పటికే నమశ్శివాయ రౌండులోకి వచ్చేశాడు. మొదటి దెబ్బ అలసట నుంచి, అంతకుమించి భయం నుంచి తేరుకుని – సిద్ధంగా నిలబడ్డాడు నమశ్శివాయ. అతని ధైర్యానికి ప్రేక్షకులంతా చప్పట్లు చరిచారు. నాకూ ముచ్చటేసింది. "ఇంత ధైర్యం నమశ్శివాయకు ఎలా వచ్చిందా?" అని ఆశ్చర్యపడ్డాను.

కుస్తీ మళ్ళా ప్రారంభమైంది. ఇప్పుడిక నమశ్శివాయ దాదాపు ప్రేక్షకులందరి 'హీరో' అయిపోయాడు. ఇన్నాళ్ళూ ప్రేక్షకులలో రంగసామి బలాన్ని మెచ్చుకొన్నారే కాని, యీ సారి 'నమశ్శివాయ'తో తమని పోల్చుకున్నారు. నమశ్శివాయని తమ ప్రతినిధిగా భావించారు. నమశ్శివాయ ప్రతి కదలికనూ హర్షించారు. చప్పట్లు కొట్టారు. గర్జనలు చేశారు.

అవన్నీ పరోక్షంగా రంగసామి మనస్సు మీద దెబ్బ తీస్తున్నాయనుకొంటాను. ఈసారి అతనేమీ ఉత్సాహంగా లేడు. పైపెచ్చు మరింత పరాకయ్యాడు. అయినా కుస్తీ సాగుతూనే ఉంది. ఉన్నట్టుండి నమశ్శివాయ విచిత్రమయిన గర్జన చేశాడు ప్రేక్షకులంతా అదిరిపడేలాగ, తెల్లబోయేలాగ. రంగసామి కూడా ఊహించనట్టుంది. అతనూ తెల్లబోవడం గమనించాను. కళ్లు మూసి తెరిచేలోగా ఆ గర్జనతోనే ముందుకు లంఘించాడు నమశ్శివాయ. అంతే తెలుసు ప్రేక్షకులకి. మరుక్షణంలో రంగసామి మూలుగు వినిపించింది. అతని నడుం, తొడచుట్టూ నమశ్శివాయ చేతులు కనిపించాయి. అంతే. చెట్టులాగ రంగసామి కూలిపోయాడు.

ఆ తర్వాత రంగసామి లేవలేదు. లేవాలనుకుంటే లేవగలడేమోననిపించింది. కాని లేవాలనుకోలేదు. ఎంచాతనంటే రంగసామి స్పృహ తప్పిపోయాడు.

ఆ తర్వాత పోలీసులు వెంటనే జాగ్రత్త పడిఉండకపోతే కనీసం అయిదారు మంది త్రొక్కిసలాటలో కన్నుమూసేవారు. మరి ముప్ఫైమందయినా ఆసుపత్రికి చేరేవారు. అంత అలజడి, అంత ఉత్సాహమూ, అంత కరతాళ ధ్వనులూ మిన్నుముట్టాయి. కలెక్టరుగారు వేదిక మీదకు రావడమూ నమశ్శివాయను కావలించుకోవడమూ, పదివేల రూపాయల సంచినీ అతని కివ్వడమూ ఎవరూ పట్టించుకోలేదు. నమశ్శివాయని తర్వాత బ్రహ్మరథం పట్టేశారు. దాదాపు వందకార్లు, పది లారీలు, రెండు మూడువందల మంది వెంటరాగా పెద్ద ఊరేగింపు చేశారు.

నాకు మాత్రం ఆశ్చర్యం తీరలేదు. ఇది స్వయంగా కళ్ళతో చూసినా నమ్మశక్యం కాకుండా ఉంది. రంగసామి, నమశ్శివాయ ఈ విషయంలో రాజీ పడ్డారా అనుకున్నాను. కాని అదేం కాదు. రంగసామి ఆ తర్వాత చాలా రోజులు మంచం పట్టాడు. ఈ పోటీ కారణం కాకపోయినా ఆయన చాలా రోజులు మంచం మీద ఉన్నాడు.

మరి వారం పదిరోజులపాటు ఎక్కడ చూసినా నమశ్శివాయ ప్రసక్తే వినిపించింది. అతని గురించి పత్రికలు తెగ వ్రాశాయి. ఫోటోలు ప్రచురించాయి. ఒక కవి అతని జీవితచరిత్ర వ్రాయదలిచినట్టు ప్రకటించాడు. కాని ఆ తర్వాత ఈ కీర్తినంతా మూటగట్టుకోవలసిన నమశ్శివాయ ఎక్కడా కనిపించలేదు. కుస్తీ జరిగిన నాలుగోనాడే నమశ్శివాయ మాయమయాడు. తర్వాత చాలా ఏళ్ళపాటు ఎవరికీ కనిపించలేదు నమశ్శివాయ.

***************

ఆరేళ్ళ తర్వాత గూడూరు బస్సుస్టాండులో సిల్కులాల్చీ, గ్లాస్కో పంచె, మఫ్లర్‌తో మళ్ళీ కనిపించాడు నమశ్శివాయ. మనిషి ఏమీ మారలేదు. చూడగానే పోలిక పట్టాను. భుజంమీద చెయ్యి వెయ్యగానే, యిటుతిరిగి "మీరా!" అన్నాడు. మద్రాసు వెళ్ళే బస్సు ఎక్కడానికి తొందరపడుతున్నాడు. బస్సు బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ఆ గడబిడలోనే కుశల ప్రశ్నలు వేశాడు.

ఆరేళ్ళ కిందట వేసిన పాత ప్రశ్నలే మళ్ళీ వేశాను. "ఇన్నేళ్లయి పోయింది. ఇప్పుడు తెలిసినా మరేం ప్రమాదం లేదు. ఇప్పుడు నేనూ ఆ వూళ్ళోలేను. చెప్పు రంగసామిని ఎలా జయించావు?" అన్నాను.

ఆ విషయాలు మరచిపోయినట్టున్నాడు. రంగసామి ప్రసక్తిరాగానే అతని ముఖం తెల్లబడింది. అది మాట్లాడడానికి యిష్టం లేనివాడిలాగ "పోనిద్దురూ?" అన్నాడు.

కాని వదల్లేదు. వత్తిడి చేశాను.

చివరికి అన్నాడు : "మీవల్లే. మీరే కారణం."

నేను దిమ్మరపోయాను "నేనా!"

"అవును. నేనన్ని వ్యాపారాలూ చేశాను. రకరకాలుగా బ్రతికాను. కాని ఎంత జరిగినా మళ్ళీ బ్రతుకు మామూలు చోటుకే రావడం ప్రారంభించింది. ఈ దరిద్రం తీరిపోయేలాగ మంచి లాభసాటి వ్యాపారం ఏమిటా అని ఆలోచించే సమయంలో రంగసామి గుర్తుకొచ్చాడు. అతనితో పోటీపడితే కొన్ని వేలు రాబట్టవచ్చుననిపించింది. అన్ని పనులూ చేసి నిస్పృహ చెందినవాడిని, అతణ్ణి జయిస్తే మరి నాలుగయిదేళ్ళు శ్రమలేకుండా పోతుంది. కనీసం ఓ వ్యాపారానికి పెట్టుబడయినా కుదరుతుంది. దెబ్బతిన్నానూ జీవితమంతా పనికిరాకుండా పోతాం – ఏ కాలో చెయ్యో విరిగి అయినా. అందుకు సిద్ధపడ్డాను" అన్నాడు నవ్వుతూ.

ఇంకా చెప్పవలసిన విషయం బయట పడలేదు – ఆతృతగా చూశాను.

"రంగసామిని మొదట్నుంచీ తెలుసు నాకు. అంత శరీరానికి వెనక, చాలా మెత్తటి మనసుంది. ఎంత చిన్నవిషయానికయినా బాధపడతాడు. దయ, జాలి కలవాడు. అతని పెళ్ళాం చచ్చిపోయింది. ఒకే ఒక్క కొడుకు మిగిలి ఉన్నాడు. అతణ్ణి మద్రాసులో చదివిస్తున్నాడు. ఆ కొడుకుని అడ్డం పెట్టుకుని విజయం సాధించాను."

"ఎలా?"

"సింపుల్. పోటీ రేపు ఉందనగా మీరు నాకు రాసిచ్చిన ఉత్తరం అందేటట్టు పోస్టు చేశాను. కొడుక్కి జబ్బుగా ఉందంటూ. మనిషి గిజగిజలాడిపోయి ఉంటాడు. కొడుకు దగ్గరికి వెళ్ళాలంటే పోటీ అడ్డొచ్చింది. అంతవరకూ వచ్చాక ఇది మానలేదు. ఎవరేనా మనిషిని పంపాలంటే తిరిగి వచ్చి విషయం చెప్పే వ్యవధిలేదు. ఆ రాత్రంతా యాతనపడి ఉంటాడు. పోటీ మొదలయే సమయానికి ఓ టెలిగ్రాం వచ్చే ఏర్పాటే చేయించాను. కాని అది రెండు రౌండులయిపోయాక అందింది. "కొడుకు పరిస్థితి తీవ్రంగా ఉందనీ, వెంటనే బయలుదేరాలనీ వార్త అది. మనిషి జారిపోయాడు. ఏకాగ్రత చెదిరిపోయింది. అంత మనిషీ నీరయిపోయాడు. ఆ ఒడుపు చూసి కొట్టేశాను" అని ఆగాడు.

ఇది విన్నాక రంగసామిమీద జాలీ, నమశ్శివాయ మీద జుగుప్సా పెనవేసుకున్నాయి. బస్సు బయలుదేరడానికి కండక్టరు విజిల్ వేశాడు. బస్సు ఎక్కుతూ అన్నాడు నమశ్శివాయ. "ఇది విన్నాక మీరు నన్ను అసహ్యించుకొంటారు నాకు తెల్సు. కానీ ఏం చెయ్యమన్నారు? బ్రతకడానికి ఆ మేరు పర్వతాన్ని ఆశ్రయించాను. ఇలా చేసినందుకు నా మీద నాకే అసహ్యం వేసింది. అందుకే అక్కడినించి కనిపించకుండా పోయాను. ఏమయినా రంగసామి మహాబలవంతుడు, నేనో చలిచీమగాణ్ణి."

బస్సు కదిలిపోయింది. ఆలోచిస్తూ నిలబడిపోయాను.

రంగసామి మహాబలవంతుడయినా, ఈ చలిచీమ కాటుకి లొంగిపోయాక మరి లేవలేదు. ఆ తర్వాత రంగసామి ఏ పోటీలకీ తలపడలేదు. అతని పరాక్రమం, బలం ఆ వూళ్లో కథగానే మిగిలిపోయాయి.

–(యువ దీపావళి సంచిక – *1968*)